శీర్షిక: తొలకరి




ఎన్. ప్రభాకరరెడ్డి

# ర్యాగింగ్

"హాయ్... నీ పేరేంటి?"

"అప్సర అనుకొంటాను!"

"కాదు 'అపరంజి బొమ్మ' కదూ?"

"కాదు. కాదు. భువి నుండి దివికి కాదు కాదు దివి నుండి భువికి దిగివచ్చిన అమృతవర్షిణి (అడ్వర్టైజ్ మెంట్‌లాగా)"

మీది మీదికి వస్తూ అడుగుతున్నారు వాళ్ళు. జవాబు చెబితే ఏమౌతుందోనని భయం. చెబితే వాళ్ళు ఇంకో రకంగా ఏడిపించవచ్చు. మాట్లాడకుండా వుండడమే మంచిది.

పురాణాల్లోనే కాదులే కాలేజీల్లో కూడా వ్రతాలు చేసే వారు వున్నట్లున్నారు, ఈమెని చూస్తుంటే?

ఏం వ్రతం రా?

తెలీట్లేదు 'మౌనవ్రతం'... మౌనవ్రతం జేస్తోంది." (పక పకలు)

"ఏం మరదలా... మౌనవ్రతం పట్టేశావు?"

"కారణం చెబితే మేం తీరుస్తాం కదా!"

"మాట్లాడితే ముత్యాలు, రత్నాలు రాలిపోవూ. వాటన్నిటినీ మనం ఎక్కడ ఏరుకుంటామోనని భయపడి నోరు విప్పలేదు. అంతే కదా?"

నవ్వు వస్తోంది ఆ మాటలకి. కానీ గట్టిగా అదిమి పట్టాను.

"అబ్బ... ఆ మొహం చూడు అచ్చు పువ్వులాగుంది.

అరెరె... ఆ పెదవులు చూడు... అద్దిరాంబురా

అహా... చూస్తుంటేనే ముద్దుపెట్టు కోవాలనిపిస్తోంది.

ఏయ్... తప్పు తప్పు, పువ్వుల్ని తాక కూడదు.

ఇలా చూసి ఆనందించాల్సిందే."

సిగ్గుగా అనిపించింది ఆ వర్ణనకు.

కానీ నడక మాత్రం ఆపలేదు.

"అరెరె... మన కాలేజీకి హంస ఎప్పు డొచ్చిందిరా?"

నాకు అర్థంకాలేదు.

హంసలు మన కాలేజికొస్తున్నా యిరా నడచి.

అబ్బ... మన కాలేజీ ఎంత పుణ్యం చేసుకుందో.

అర్థమై గర్వంగా అనిపించింది.

"అయినా పాపా... నీకు ఈ పంజాబీ డ్రస్సు అంతగా నప్పలేదే. ఓణీ అయితేనే బావుంటుంది"

వెంటనే నిర్ణయించుకున్నాను 'రేపటి నుంచి పంజాబీ డ్రస్సు బహిష్కరణ' అని..కాలేజీ బస్సొచ్చింది తిరిగెళ్ళడానికి.

బస్సెక్కి ఒక సీటులో కూర్చొన్నాను. వాళ్ళు పక్కగా వచ్చి నిల్చున్నారు.

'అమ్మాయే ఇంత అందంగా వుంటే అక్షరాలు ఇంకెంత అందంగా వుంటాయో?"

"తీసుకో చూద్దాం"

నోట్‌బుక్ పట్టుకున్నాడు లాక్కుం టున్నట్లుగా.

వదిలెయ్యక తప్పింది కాదు.

వాళ్ళు దానిని తీసుకుంది నా పేరు చూసేందుకని నాకు తెలుసు. కానీ... నేను నా పేరు వ్రాయలేదు అందులో.

'పేరు లేదురా' తిరిగిచ్చేశాడు.



తీసుకొని చిన్నగా నవ్వుకున్నాను.

"సిస్టర్, సిస్టర్. నాకు టిక్కెట్టు తీసుకోండి. డబ్బుల్లేవు. జేబులు ఖాళీ చూడండి."

"సారీ" అన్నాను మొదటిసారి నోరు తెరుస్తూ (లోలోపల నవ్వు).

"మరయితే నేను తీసుకుంటా టిక్కెట్టు" (మరొకతను)

"వద్దు" అన్నాను ఖచ్చితంగా మాట్లా డినట్లు.

ఎవరో ఒకతను వచ్చి మీద పడ్డాడు.

'సారీ వెనకనుంచి ఎవరో నెట్టేశారు.

'ఇట్సోకే' అన్నాను సరిగ్గా కూర్చుంటూ (తిట్టుకుంటూ).

మళ్ళీ వచ్చి పడ్డాడు.

మళ్ళీ 'సారీ' చెప్పాడు.

కోపం విపరీతంగా వచ్చేసింది.

ఏం చేయగలను?

అంతలో ఆపద్బాంధవుడిలా రాజేష్ వచ్చాడు.

వస్తూనే 'ఏంటిరా మరీనూ. ఆ అమ్మాయిని ఎందుకు ఏడిపిస్తున్నారు. వదిలెయ్యండి" అంటూ పక్కనొచ్చి నిల్చొన్నాడు.

"ఏయ్... ఏంటిరా కథ?"

"షి ఈజ్ మై సిస్టర్"

"ఓ... ఒకే ... ఒకే..."వాళ్ళు వెళ్ళిపో యారు.

హమ్మయ్యా! అని ఊపిరి పీల్చుకు న్నాను.

కామెంట్ చేసేవరకే 'అయితే చాలా బావుంటుంది.

కానీ శృతిమించితేనే తలనొప్పి.

అయినా రాజేష్ సమయానికి వచ్చాడు. రాజేష్ నవ పెదనాన్న కొడుకు. చాలా బుద్ధిమంతుడు. ఇంట్లోనూ మంచి పేరుంది. ఎవరి తోనూ ఎక్కువ మాట్లాడడు. అమ్మా యిల్తో అస్సలు మాట్లాడడు. 'బుద్ధి మంతుడంటే అలాగ వుండాలి' అను కునేదాన్ని.

అతను నా కంటే ఒక సంవత్సరం సీనియర్. నేను ఇప్పుడు డిగ్రీ ఫస్టియర్ చేరాను.

***

పేపర్‌ని మూలకి మడిచి 'రాకెట్' తయారుచేశాడు రాజేష్.

చేతితో అదిమి దాన్ని ఫోర్స్‌గా వది లాడు గురిచూసి.

అది వెళ్ళి గుండెలకు హత్తుకునివున్న బుక్కుకి, ఆ అమ్మాయి శరీరానికి మధ్య గుచ్చుకుంది.

"అహా... గురూ. గురంటే నీదే గురూ" మెచ్చుకున్నాడు పక్కనున్న ఒక 'తోక'

"పిట్ట... పిటపిటలాడుతుంటే గురి ఎక్కడుంటుంది మరి." (నవ్వులు)

'గురూ... గురూ మిటుకులాడి వస్తోంది. ఒక చూపు చూడు గురూ'

"పదండి"

ఆ 'మిటుకులాడి' అనబడే అంద మైన అమ్మాయి వెనక్కి చేరారు.

వెనగ్గా నడుస్తూ చెబుతున్నాడు రాజేష్

"రేయ్... లైటుంది. కరెంటుంది. అప్పుడు స్విచ్ కనిపిస్తే ఏం చేస్తాంరా?"

'నొక్కేస్తాం గురూ'

"కరెక్ట్"

"ఆకలిగా వుంది. గిన్నె నిండా పర మాన్నం వుంది. అది ముందర పెడితే ఏం చేస్తాంరా?"

"ఆరగిస్తాం గురూ"

"వెరీగుడ్"

"తెగ టెన్షన్‌గా వుంది. చేతు లంతా బురబుర మంటున్నాయి అంద మైన జడ కనిపిస్తుంది. ఏం చేస్తాంరా?"

"పట్టి గుంజుతాం గురూ"

గబుక్కున వంగి ఆ మిటుకులాడి జడ పట్టుకునే ప్రయత్నం చేశాడు.

ఆ అమ్మాయి అతడికా అవకాశం ఇవ్వలేదు. మెరుపు వేగంతో కదిలి అతడి జుట్టు పట్టుకుంది.

"హాయ్... నీ పేరేంటన్నావ్?" అడి గిందా అమ్మాయి.

"అబ్బులు..." ఎవరో అమ్మాయి, ఎప్పుడొచ్చిందో, సమాధానం చెప్పింది.

"అయ్యో పాపం, ఈ మొహం చూడు... అహా ఈ పెదవులు చూడు, ఓహో ఈ కళ్ళు చూడు" కరాటే నేర్చిన ఆ అమ్మాయి చేతులకే కాదు కాళ్ళకూ పని చెప్పింది.

అక్కడిప్పుడు ఒకే ఒక్క మగ పురుగు నేల మీద కూలబడి వుంది.

●●